క్లుప్తంగా

ఎన్నికల డీటీగా గుండాల్‌ నాయక్‌



ఆలూరు రూరల్‌: ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా గుండాల్‌నాయక్‌ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న గాయత్రి ఆస్పరి మండల డీటీగా బదిలీ అయ్యారు. చిప్పగిరి మండల డీటీ విధులు నిర్వర్తిస్తున్న గుండాల్‌నాయక్‌ను ఆలూరు ఎన్నికల డీటీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపడతామన్నారు.

ఈ–క్రాప్‌ పక్కాగా చేపట్టాలి



రాళ్లదొడ్డిలో ఈ–క్రాప్‌ నమోదును పరిశీలిస్తున్న జేడీ వరలక్ష్మి

ఎమ్మిగనూరు: రైతులు సాగుచేసిన వివిధ రకాల పంటలను తప్పనిరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని, ఈ ప్రక్రియను సెప్టెంబర్‌ 15లోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఎల్‌.వరలక్ష్మి పేర్కొన్నారు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డిలో సోమవారం పంట నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. పంట సాగు చేసిన ప్రతి రైతుకు మేలు జరగాలంటే ఈ–క్రాప్‌ నమోదు అవసరమని, విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ఈ–క్రాప్‌లో నమోదైన పంటలనే పరిగణలోకి తీసుకొని సాయం అందిస్తారన్నారు. ఏడీఏ మహ్మద్‌ ఖాద్రి, ఏఓ మహేశ్వరరెడ్డి, వ్యవసాయ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా ఏజీఎం సాగర్‌

మద్దికెర: వైఎస్సార్‌ క్రాంతి పథంలో అమలు చేస్తున్న స్త్రీనిధి పథకాన్ని పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా ఏజీఎం సాగర్‌ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పొదుపు గ్రామైక్య సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలంలో పది సంఘాలకు లోన్‌లు తీసుకునే అవకాశం వచ్చిందన్నారు. గతంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మరిన్ని గ్రూపులకు లోన్‌ సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే నీతిఆయోగ్‌కు మద్దికెర మండలం ఎంపికై నట్లు చెప్పారు. మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఏపీఎం మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్‌ శిబిరం సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్‌: జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు నేటి నుంచి (సోమవారం) ఈ నెల 25వ తేదీ వరకు మండల కేంద్రంలోని సచివాలయం–2లో నిర్వహించే ఆధార్‌ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అల్లబకాష్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌ ఈ–కేవైసీ, ఫోన్‌ నంబర్‌ లింక్‌ కొరకు రూ.100 చెల్లించాలన్నారు. కొత్తగా ఆధార్‌ కార్డు ఎన్‌రోల్‌ చేసుకునే వారికి ఉచితంగా నమోదు చేస్తామన్నారు. చిరునామా మార్పు, పేరు మార్పు కొరకు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆధార్‌ కార్డులో మార్పుల కోసం వచ్చే వారు కరెక్షన్‌ ఫారం నమోదు చేసి తహసీల్దార్‌, ఎంపీడీఓ లేదా గజిటెడ్‌ అధికారి సంతకం తప్పనిసరిగా చేయించాలన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ట



అజాది శంభులింగ మహాస్వాములకు కానుక సమర్పిస్తున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రంలోని దిడ్డి కాలనీలో సోమవారం తెల్లవారుజామున బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి నుంచి గంగిపూజ, గోపూజ, విష్ణు సహస్రనామ హోమాలు ఇతర ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున జే హొసళ్లికి చెందిన అజాది శంభులింగ మహాస్వాములు చేత బొడ్రాయి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంభులింగ మహాస్వామి మాట్లాడుతూ.. భక్తు భక్తులకు అన్నదాన ఇతర కార్యక్రమాలు జరిగాయి.

24న మండల సమావేశం

హాలహర్వి: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంతోని సోమవారం తెలిపారు. సమావేశంలో అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

జ్వరాలతో జరభద్రం

- పొంచి ఉన్న సీజనల్‌ వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ఫ్యామిలీ ఫిజీషియన్‌ ద్వారా ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్న మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్‌ మారుతి

ఆలూరు రూరల్‌: వర్షాకాలంలో ఎక్కడ చూసినా చిత్తడిగా మారి ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంటోంది. దీంతో దోమలు వృద్ధి చెందడమే గాకుండా తాగునీరు కలుషితమయ్యే పరిస్థితులు ఉన్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్‌, డెంగీ తదితర సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువ. అందుకే ప్రజలు అపరిశుభ్రతతో పాటు, సురక్షితమైన తాగునీరు తాగడం, దోమ తెరలు వాడటం, తదితర ముందు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్‌ వ్యాధులు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

దోమల వ్యాప్తి కారణంగా మలేరియా, డెంగీ వంటి తదితర వ్యాధులు వస్తాయి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభం సమయంలో దోమలు గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. నీరు నిల్వచేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, పాడేసిన కొబ్బరి చిప్పలు, రుబ్బురోళ్లు, వాటర్‌ ట్యాంకులలో దోమల లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజన్‌కు నిమిత్తం లేకుండా ఫ్రైడే –డ్రైడే పై అవగాహన కలిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం

సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో మొలగవల్లి, కమ్మరచేడు, అర్దగేరి, హొళగుంద, ఆస్పరి, గజ్జహళ్లి తదితర పీహెచ్‌సీల పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రజలను ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఏఎస్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్‌ అధికారులు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరం లక్షణాలు ఉన్న వారందరి రక్తాన్ని సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్‌ విధానంలో భాగంగా ఇంటింటికీ డాక్టర్లు రావడంతో అక్కడికక్కడే రోగులు పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నారు. జర్వం నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలకు సిబ్బంది ఆరోగ్యంచ శుభ్రత, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ, ఆరోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటికి వచ్చి మందులు ఇస్తున్నారు



వారంలో రెండు సార్లు మా గేరికి వచ్చి డాక్టర్లు నీకు సుస్తి అయ్యిందా అని అడిగి మాత్రలు ఇస్తున్నారు. జ్వరం ఉందా.. ఒళ్లు నొప్పులు ఉన్నాయా.. తలనొప్పి ఉందా అని అడిగి మందులు ఇస్తారు. మా ఇంట్లో పిల్లలకి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఇంతకు ముందు ఆరోగ్యం బాగాలేకుంటే నడిచి ఆస్పత్రికి పోయేవాళ్లం. ఇప్పుడు ఇంటి కాడికే డాక్టర్లు వస్తున్నారు. ఇబ్బంది లేకుండా పోయింది. – మారెప్ప, వృద్ధుడు, కోయనగర్‌, ఆలూరు

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. రోగ నిరోధక శక్తి పెంచుకోవడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే పాటించాలి. పంచాయతీ అధికారులు వారానికోసారి నీటి ట్యాంకులు శుభ్రం చేయించాలి.ప్రజలకు జ్వరాలు ఇతర సీజనల్‌ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ఆలూరు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌లో ఉన్నాయి. – వాహిద్‌, డాక్టర్‌, ఆలూరు

2న బహిరంగ సభ

వెల్దుర్తి: సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సీపీఐ బస్సు యాత్ర సెప్టెంబర్‌ 2న పత్తికొండ చేరుకుంటుందని, ఇక్కడ బహిరంగ సభ ఉంటుందని, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఏఐవైఎఫ్‌ జిల్లా కార్యదర్శి కారుమంచితో కలిసి స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ, అనుబంధ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. బస్సు యాత్ర, బహిరంగ సభ విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నియోజకవర్గ సమస్యలను పార్టీ అధినాయకులు బహిరంగ సభలో ప్రస్తావించనున్నట్లు తెలిపారు. సీపీఐ, రైతు సంఘం, వ్యవసాయ, కార్మిక, చిన్న వ్యాపారుల సంఘం నేతలు టి.కృష్ణ, రాజు, బాలరాజు, మాధవకృష్ణ, వెంకటేశ్వర్లు, హరి, ఎల్లప్ప, అనిల్‌ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ కోతలు

హొళగుంద: ఆలూరు 130 కేవీ నుంచి హొళగుంద సబ్‌స్టేషన్‌ వరకున్న ప్రధాన లైన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఓబులమ్మ ఏఈ తెలిపారు. ఇటీవల కాలంలో బ్రేక్‌ డౌన్‌ కావడం, ఇతర సమస్యల కారణంగా తరుచూ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు. దీన్ని నివారించేందుకు లైన్‌ మరమ్మతులు చేస్తున్నామని, మండల ప్రజలు సహకరించాలని కోరారు.

పాఠశాల వద్ద స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

హొళగుంద: హొళగుంద, హెబ్బటం గ్రామాలలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల వద్ద స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రధానంగా హొళగుందలోని ఉన్నత పాఠశాల ప్రధాన గేట్లు, హెబ్బటంలో బస్టాండ్‌ నుంచి కురుకుంద రస్తా వరకు రోడ్డు మధ్యలో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఇక్కడే ప్రమాదాలు జరిగి చాలా మంది తీవ్ర గాయాలకు గురైన సందర్భాలున్నాయి. ఈ ప్రదేశాల్లో సీసీ రోడ్లు ఉండడంతో వాహన చోదకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటోంది. ఉన్నత పాఠశాలలు రోడ్డు పక్కనే ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి హైస్కూళ్ల వద్ద అవసరమైన చోట్ల స్పీడ్‌ బ్రేకర్లు వేసి వాహనాల వేగానికి కళ్లెం వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

జయప్రదం చేయండి

గోనెగండ్ల: కర్నూలులోని ఎస్టీయూ భవన్‌లో ఈనెల 25, 26 తేదీలలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జూనియర్‌ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం వల్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. జాతీయ నూతన విద్యా విధానం రద్దుకై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్‌ మారుతి

ఆలూరు రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమం ద్వారా రోగుల ఇంటి వద్దకే వైద్యం అందుతోందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్‌ మారుతి అన్నారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి ఆలూరులోని సచివాలయం–3 పరిధిలో రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. దీర్ఘకాలిక రోగులకు రక్త, మూత్ర నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం ఆలూరు సీహెచ్‌సీకి పంపారు. ఆయన మాట్లాడుతూ.. ఏఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వారంలో రెండు సార్లు వెళ్లి దీర్ఘకాలిక రోగుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలన్నారు. గుండె జబ్బులు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారి వివరాలు ఆరోగ్య శ్రీ కింద నమోదు చేయించాలన్నారు. 67 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ, షుగర్‌ వంటి తదితర పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఏఎస్‌ఎం యశోద వైద్య సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పల్లకోత్సవం



చిన్నమరివీడులో పల్లకీని ఊరేగిస్తున్న గ్రామస్తులు

గోనెగండ్ల: మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో శ్రీ భీరప్ప స్వామి పల్లకోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. ఆదివారం భక్తులు పల్లకీతో తుంగభద్ర నదికి వెళ్లి సోమవారం పాదయాత్రగా గ్రామానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం భీరప్ప స్వామి దేవాలయం నుంచి నది జలాలను తీసుకుని పల్లకీలో భీరప్ప స్వామిని ఊరేగించారు. దేవతా మూర్తులను నది జలాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా భీరప్ప డోళ్ల విన్యాసాలు అలరించాయి. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వధువరులు పాలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పూజారి ఎల్లప్ప, గ్రామీణ వైద్యుడు చంద్ర గుప్త, మాలన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద మొక్కలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌ రెడ్డి

గోనెగండ్ల: మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యంతో పాటు సకాలంలో వర్షాలు కురుస్తాయని డ్వామా పీడీ అమర్‌నాథ్‌ రెడ్డి అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా బ్లాక్‌ ప్లాంటేషన్‌ కార్యక్రమంలో భాగంగా గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. చెట్లను ఇష్టానుసారంగా నరకడం వల్ల భావితరాలకు ముప్పు తప్పదన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి పచ్చతోరణం పథకానికి శ్రీకారం చుట్టి పెద్ద ఎత్తున మొక్కలు నాటించారని గుర్తుచేశారు. అలాగే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. ఫీల్డ్‌ అసిస్టెంట్‌ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

హత్తిబెళగల్‌కు బీటీ రోడ్డు



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆలూరు: ఇచ్చిన హామీ మేరకు హత్తిబెళగళ్‌ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆలూరు మండల కేంద్రం నుంచి హత్తిబెళగళ్‌ గ్రామానికి 2.80 కి.మీ దూరం ఉంది. గ్రామానికి రోడ్డు సరిగా లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేందుకు గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడేవారు. సమస్యను గ్రామస్తులు మంత్రి జయరాం దృష్టికి తెచ్చారు. మంత్రి ఆదేశాలతో పనులు ప్రారంభం కాగా కాంట్రాక్టర్‌ కంకర వేసిన తర్వాత రోడ్డు పనులను కొంత కాలం పాటు వదిలేశారు. పనులు నిలిచిపోవడంతో గ్రామస్తులు మరోసారి మంత్రికి ఫిర్యాదు చేశారు. మంత్రి కృషితో గ్రామ రోడ్డు పనులను కాంట్రాక్టర్‌ రమేష్‌రెడ్డి రూ.1.68 కోట్లతో దక్కించుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆలూరు నుంచి హత్తిబెళగళ్‌ గ్రామం వరకు బీటీ రోడ్డు పనులను పీఐయూ డీఈ భాస్కర్‌ సమక్షంలో ప్రారంభించారు. ఎట్టకేలకు మంత్రి గుమ్మనూరు జయరాం చొరవతో రోడ్డు నిర్మిస్తుండడంపై గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డును బాగు చేయండి



కలెక్టర్‌ను కలిసిన నెరణికి గ్రామస్తులు

హొళగుంద: నెరణికి గ్రామం నుంచి దేవరగట్టు వరకు సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగప్ప, ఎస్కే గిరి, రవిస్వామి, మల్లయ్య, మఠం మహేశ్‌, రమేశ్‌ తదితరులు సోమవారం జిల్లా కలెక్టర్‌ సృజనను కలిసి విన్నవించుకున్నారు. రోడ్డు బాగలేనందున గ్రామం నుంచి దేవరగట్టుకు వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడ్తున్నారని తెలిపారు. రోడ్డును బాగు చేయడంతో పాటు నెరణికిలో డ్రైన్లు ఏర్పాటు, మంచినీటి కొరతను తీర్చాలని కోరినట్లు వారు తెలిపారు.

స్పందనతో సత్వర పరిష్కారం

చిప్పగిరి: స్పందన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినతులు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ బాలనాయుడు, ఏఓ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ రాంనీలా, ఏపీయం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కటాక్షం కోసం..



కదమకుంట్లలో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న యువకులు

తుగ్గలి: వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ సోమవారం కడమకుంట్లలో బొడ్రాయికి జాలాభిషేకం, విరాటపర్వం పఠనం చేశారు. యువకులు ఉపవాసం ఉండి గ్రామంలోని బొడ్రాయికి 101 బిందెలతో జలాభిషేకం చేశారు. శివాలయంలో వెంగళ రెడ్డి, వెంకటస్వామి విరాటపర్వం పఠం చేశారు. వరుణ దేవుడు కరుణించి మంచి వర్షాలు కురిపించాలని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. రామలింగాయపల్లిలో మూడు రోజులుగా సప్తభజనలు చేస్తున్నారు. ఆలయ నిర్వాహకులు ప్రకాష్‌ రెడ్డి, నారాయణ, తిమ్మన్న పాల్గొన్నారు.

మద్దికెర: శ్రావణమాసం అయినా ఇంతవరకు వానలు పడకపోవడంతో మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాలలో సోమవారం 101 బిందెల నీటితో బొడ్రాయిలకు యువకులు అభిషేకం చేసి టెంకాయలు సమర్పించారు. దేవుడు చల్లంగా చూడాలని వానలు సకాలంలో కురవాలని, చెరువులో నీరు రావాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఉదయమే చన్నీటి స్నానమాచరించి బొడ్రాయికి అభిషేకం, అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

హాలహర్వి: విరుపాపురం గ్రామంలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రజలు వర్షం కోసం ప్రజలు భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాలు లేకపోవడంతో సాగైన పంటలు వాడుముఖం పడుతున్నాయన్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే పంటలు జీవం పోసుకునే అవకాశం ఉందన్నారు. భజనలు చేస్తే వర్షం కురుస్తుందను నమ్మకంతో కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగ పంచమి



వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ మైదానంలో నాగులకట్టకు పూజలు చేస్తున్న మహిళలు

వెల్దుర్తి: శ్రావణ శుద్ధ పంచమి సోమవారం సందర్భంగా నాగ పంచమిని మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టలు, నాగ ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌ మైదానంలో నాగ ప్రతిమలకు భక్తులు విరివిగా తరలివచ్చి పాలుపోసి పూజించి నైవేద్యం సమర్పించారు. ఆ ఆదిశేషుని కరుణకటాక్షాలు తమపై ఉండాలని ఉపవాస దీక్షలతో ప్రార్థించారు.

గోనెగండ్ల: శ్రావణమాసం సందర్భంగా సోమవారం గోనెగండ్ల, చిన్ననేలటూర్‌ తదితర గ్రామాల్లో భక్తులు నాగుల కట్టకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్ననేలటూర్‌ గ్రామంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మహిళలు, పిల్లలు నియమ నిష్ఠలతో ఆయా దేవాలయాల్లో ప్రతిష్టించిన నాగుల కట్ట వద్ద నాగ ప్రతిమలకు సంప్రదాయం ప్రకారం పాలుపోసి నైవేద్యం సమర్పించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఆలూరు: బాల సాహిత్యంతో నేటి విద్యార్థులకు పుస్తక పఠనం అలవర్చేలా రచనలు చేస్తున్న గణిత ఉపాధ్యాయుడు, బాలసాహిత్యవేత్త సోమన్న కృషి ప్రసంశనీయమని ఎస్‌ఐ డాక్టర్‌ నాయక్‌ కితాబు ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక లైబ్రరీలో వారు సోమవారం ఉపాధ్యాయుడు సోమన్న రచించిన నిండు జాబిలి పుస్తకాన్ని లైబ్రేరియన్‌ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ పుస్తక సందేశం వినిపించారు. విద్యార్థుల్లో పుస్తక పఠనం వల్ల సృజనాత్మకత పెరుగుతుందని, మేధాశక్తి వికశిస్తుందని చెప్పారు. రిటైర్డు ఎంఈఓ రామలింగమ్మ, కళాకారులు కేశవయ్య, బీ.టి.లక్ష్మన్న, లైబ్రేరియన్‌ విజయ్‌భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

హొళగుంద: స్థానిక ఈబీసీ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప మాట్లాడుతూ.. ఈబీసీ కాలనీలోని అర్హులైన వారికి వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దారు హుసేన్‌ సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్‌, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు

ఎమ్మిగనూరుటౌన్‌: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్మిక చట్టాలను సవరించి వారికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కుర్ణి కళ్యాణ మండపంలో ఏఐటీయూసీ, వ్యవసాయ సంఘ నాయకులు ఆ సంఘం నుంచి ఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్‌లో ఆయన సమక్షంలో చేరారు. అంతకుమునుపు పట్టణంలో ర్యాలీ చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆమోస్‌, జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఐఎఫ్‌టీయూ నూతన తాలుకా అధ్యక్ష, కార్యదర్శులుగా ఉరుకుందు, బాలరాజుతో పాటు 19 మంది సభ్యులను ఎన్నుకోగా ఏఐకేఎంఎస్‌ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులుగా చంద్రగౌడ్‌, సత్యన్నలను ఎన్నుకున్నారు.

ఓటరు సర్వే పూర్తి చేయండి

మద్దికెర: ఓటరు వెరిఫికేషన్‌ పూర్తి చేయించాలని సంబంధిత వీఆర్వోలకు తహసీల్దార్‌ నాగభూషణం ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో వీఆర్వోల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సర్వేలో వెనకబడిన బీఎల్‌ఓలను గుర్తించాలన్నారు. అలాగే లేనిచోట కొత్తవారిని నియమించడం జరిగిందని, అలాంటి వారికి సహకారమందించి పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు.

సర్వే 90 శాతం పూర్తి

తుగ్గలి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల రోజులుగా చేస్తున్న సమగ్ర ఓటరు సర్వే గడువు సోమవారంతో ముగిసింది. మండలంలో ఇప్పటివరకు 90 శాతం సర్వే పూర్తయిందని, మిగిలిన పది శాతం కూడా త్వరలో పూర్తి చేయనునట్లు తహసీల్దార్‌ రవి తెలిపారు. కొత్త ఓటర్లుగా నమోదు చేయించుకోవాల్సిన వారు తమ ఓటును బూత్‌ స్థాయి అధికారులు వద్ద లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పేరులో తప్పులు ఉంటే ఫారం–8 అందజేయాలన్నారు.

క్రైం కార్నర్‌

బొలెరో ఢీకొని తండ్రి, కుమార్తెకు తీవ్రగాయాలు



గాయపడిన చందన గీతకు అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందిస్తున్న డాక్టర్‌ బాలకృష్ణారెడ్డి

ఆస్పరి: మండల కేంద్రంలోని పెట్రోల్‌ బంకు వద్ద సోమవారం స్కూటర్‌ను బొలెరో వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దేవనకొండ మండలం బుర్రకుంటకు చెందిన కృష్ణమూర్తి కూతురు చందన గీతను ఆలూరులోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో వదిలేందుకు వెళ్తుండగా ఆస్పరి నుంచి కర్నూలు వైపు అతి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రి, కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వరప్రసాద్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ లక్ష్మన్న ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ 108 వాహనంలోనే గాయపడిన వారికి డాక్టర్‌ బాలకృష్ణారెడ్డి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు



గాయపడిన భక్తులు

నందవరం: మండల పరిధిలోని కొత్తకైరవాడి గ్రామ సమీపంలో సోమవారం బైక్‌ అదుపుతప్పి ఉరుకుంద నుంచి వస్తున్న ముగ్గురు భక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నందవరం మండలం గురజాలకు చెందిన కృష్ణ, లక్ష్మి, వరలక్ష్మి బైక్‌పై ఆదివారం ఉరుకుంద క్షేత్రానికి వెళ్లారు. సోమవారం తిరుగు ప్రయాణంలో కొత్తకైరవాడి వద్ద రోడ్డుపై కల్వర్టు నిర్మాణం కోసం కంకర వేయడంతో బైక్‌ అదుపుతప్పి పక్కనున్న గోతిలో పడిపోయింది. బైక్‌పై వచ్చిన ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. కృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లక్ష్మి, వరలక్ష్మికి రక్త గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆటోలో తరలించి నాగలదిన్నె గ్రామంలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఎమ్మిగనూరు ఆసుపత్రికి పంపారు. కల్వర్టు గుంతలో పడిన బైక్‌ను బయటకు తీశారు. రోడ్డుపై కంకర వేయడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని, కంకర, ఇసుకను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆటోలు ఢీకొని విద్యార్థులకు గాయాలు

పత్తికొండ రూరల్‌: స్థానిక బైపాస్‌ రోడ్డులో సోమవారం ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఒక ఆటో బోల్తా పడగా మరో ఆటోలో వస్తున్న ప్రైవేటు స్కూల్‌ విద్యార్థులు నలుగురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాతన గ్రామానికి చెందిన భరత్‌, కావ్యను కర్నూలుకు తరలించారు.

ఎల్లెల్సీలో గుర్తు తెలియని శవం

హొళగుంద: స్థానిక తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) సోమవారం గుర్తు తెలియని వ్యక్తి శవం కొట్టుకుపోయింది. దాదాపు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి శరీరంపై ఎర్ర చొక్క, నీలి డ్రాయరు మాత్రమే ఉంది. దిగువ కాలువ కర్ణాటక నుంచి హాలహర్వి, హొళగుంద మండలాల్లో ప్రవేశిస్తుంది. సదరు వ్యక్తి కాలువలో పడి దాదాపు రెండు, మూడు రోజులు అయి ఉండొచ్చని శవం ఉబ్బిపోయిందని స్థానికులు తెలిపారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఉదయం బళ్లారి రస్తాలోని బ్రిడ్జ్‌ వద్ద స్థానికులకు కంట పడిన శవం కాలువలో ముందుకు కొట్టుకుపోయింది.